# కుడి ఎడమయితే...!

గ్రీన్వే ప్లాజా నించి బయటకు వచ్చి, ఫ్రీ వే యాభయి తొమ్మిది సౌత్‌లోకి త్రిప్పాడు కారుని, విక్రమరావ్.

జపాన్ అసైన్‌మెంటు గురించి ఆలోచిస్తూ, నెమ్మదిగా పోనిస్తున్నాడు కారుని. ఒక సంవత్సరం పాటు జపాన్‌లో పని పడింది. తన కెరియర్ అభివృద్ధి దృష్ట్యా, కంపెనీ లాభాల దృష్ట్యా వెళ్లక తప్పదు.

వేగంగా వెళుతున్న కారులో, ప్రక్కనే ముందు సీటులో, హఠాత్తుగా ప్రత్యక్షం అయ్యాడు బేతాళుడు.

"ఏమిటి? - ఏదో ఇబ్బందిలో వున్నట్టున్నావ్?" అడిగాడు విక్రమరావ్‌ని.

మొహమాటంగా నవ్వాడు విక్రమరావ్ - "అదేమీ కాదు... నాకు ఒక సంవత్సరం పాటు జపాన్ వెళ్ళవలసిన అవసరం వచ్చింది. కుటుంబంతో సహా వెళ్ళవచ్చుననుకో - అయినా పిల్లల చదువు పాడవుతుందని, నేను ఒక్కడ్నే వెడుతున్నాను -".



"అయితే - మరి నా సంగతి ఏమిటి?" అడిగాడు అమెరికా బేతాళుడు.

"జపాన్ బేతాళుడి వేషం కట్టరాదూ?" నవ్వాడు విక్రమరావ్.

"జపానూ లేదు - గిపానూ లేదు - నువ్వు మళ్ళీ అమెరికా వచ్చేదాకా, అజ్ఞాత వాసంలో వుంటాలే - నువ్వు వెళ్ళిరా - నాకు అమెరికాలోనే బాగుంది" అన్నాడు బేతాళుడు.

"నేను వచ్చే వారం వెడుతున్నాను - దాదాపు సంవత్సరం పడుతుంది వెనక్కి రావటానికి. మధ్య మధ్యలో నాలుగైదు రోజులు రావచ్చునుకో - జపాన్‌లో వ్యాపారం

చెయ్యాలంటే, ముందు జపాన్ వాళ్ళ సంస్కృతీ, అలవాట్లు, భాషా తెలుసుకోవడం అవసరం. అందుకే నాకు ట్రెయినింగ్ యిస్తున్నారు, ఈ కంపెనీవాళ్ళు..."

"అయితే జపనీస్ నేర్చుకుంటున్నావన్నమాట" బేతాళుడు.

"అవును ఈ రోజే క్లాసులు మొదలయాయి -".

బేతాళుడు సాలోచనగా అన్నాడు - "ఒక సంవత్సరం కోసం వెడుతున్న నీకు, వాళ్ల అలవాట్లూ, భాషా, సంస్కృతీ గురించి చెబుతున్నారే, మరి అమెరికాకి చదువుకోవటానికనీ, ఇమ్మిగ్రేషన్ కోసమనీ వచ్చేవాళ్ళకి - మీ భారతీయులకి - ఇండియాలో ఏదయినా ప్రోగ్రాం వుందా - అమెరికా సంస్కృతీ, అలవాట్లు గురించి చెప్పటానికి -"

విక్రమరావ్ అన్నాడు - "నాకు తెలిసినంతవరకూ, అలాటివి వున్నట్లు లేవు - మేము మొట్టమొదట ఈ దేశం రాగానే, అంతా గందరగోళంగా వుండేది. ఎడ్జస్ట్ అవటానికి కనీసం ఆరు నెలలు పట్టింది!"

"అయితే మనం ఒక పని చేద్దాం - ఈ అమెరికా బేతాళుడి పన్నెండవ కథలో, ఇక్కడి అలవాట్ల గురించి చెప్పుకుందాం. ఈ కథ చదివిన వాళ్ళకూ, విన్నవాళ్ళకూ, లాభం కలుగు తుంది" అన్నాడు బేతాళుడు.

విక్రమరావ్ పెద్దగా నవ్వాడు - "సత్యనారాయణ వ్రత పూజ చేసుకుని, కథ విన్న వాళ్ళకి లాభం కలిగినట్లునా!" అన్నాడు.

"పోనీ అలాగే అనుకో - ఎవరికి ఎంత లాభం కలిగినా మంచిదే కదా... నీ అనుభవంలో, ఇక్కడి అలవాట్లకు, మనవాళ్లు ఎలా మారితే మంచిదో చెప్పు!" అడిగాడు భేతాళుడు.

ఒక్క క్షణం ఆలోచించిన విక్రమరావ్, కారులో రేడియోని ఆపి, చెప్పటం ప్రారంభించాడు.

"మనవాళ్ళు మొట్టమొదట మార్చుకోవలసినది గబగబా మాట్లాడటం. మనవాళ్ళు చాలా స్పీడ్‌గా మాట్లాడతారు ఇంగ్లీష్ - మన ఏక్సంట్ అమెరికన్స్‌కి అసలు అర్థం కాదు - మనకి అమెరికన్ ఏక్సెంటు రాదు కనుక - ఎంత నెమ్మదిగా మాట్లాడితే, అంత మంచిది. అంతేకాదు, అమెరికన్స్ చాలా మందికి, మనం ఇండియాలో వాడే పెద్ద పెద్ద బ్రిటిష్ ఇంగ్లీష్ పదాలకు అర్థం తెలీదు. అందుకని చాలా సులభమైన భాష మాట్లాడటం అవసరం. అలాగే వాళ్ళు మాట్లాడేటప్పుడు, 'జాగ్రత్తగా" వినటం కూడా అవసరం. వాళ్ళు మాట్లాడేది అర్థం కాకపోతే, అలా అని మర్యాదగా చెప్పటం మంచిది. 'మళ్ళీ చెప్పండి - నేను సరిగ్గా ఫాలో అవలేదు' అనటంలో తప్పులేదు. అమెరికాలో, ఎవరినయినా సరే, పేరు పెట్టి పిలవటం మర్యాద. జాన్ అనో, డేవిడ్ అనో పేరుతో పిలవవచ్చు. అలాగే వాళ్ళు కూడా, రావ్ అనో, మూర్తి అనో పిలుస్తారు. 'సార్' అని, 'మిస్టర్' అని అనవలసిన అవసరం లేదు. మానేజర్‌తో

మాట్లాడు తున్నా, 'సార్' అనటం అనవసరం. ఇంకొక సమస్య. మన పేర్లు వీళ్ళకి నోళ్ళు తిరగవు!" ఆగాడు విక్రమరావ్.

"మీ తెలుగువాళ్ళు, ఎందుకు అంత పొడుగు పేర్లు పెట్టుకుంటారు - నాగ శంకర్రావ్ అనీ, బాలసుబ్రహ్మణ్యం అనీ, బాల త్రిపుర సుందరి అనీ" బేతాళుడు అడిగాడు.

విక్రమరావ్ నవ్వాడు - "విక్రమరావ్, బేతాళుడు పేర్ల లాగానే సరిగ్గా ఆలోచిస్తే, తెలుగువాళ్ళ పేర్లు పెద్దవేం కావు. తెలుగుకీ, ఇంగ్లీష్‌కీ వున్న భాషాభేదం వల్ల అలా అనిపిస్తుంది. ఉదాహరణకి సుబ్బారావ్ అన్న పేరు వుందనుకో, తెలుగులో నాలుగక్షరాలే. కానీ ఇంగ్లీష్‌లో ఎనిమిది అక్షరాలు - అంటే రెండింతలన్నమాట. దానికి కారణం, తెలుగులోని అక్షరాలు, శబ్దాలను పలుకుతాయి. ఇంగ్లీష్‌లో అక్షరాలను చేర్చి, శబ్దాలను పలకాలి. జార్జి అనే ఆరు అక్షరాల ఇంగ్లీష్ పేరు, తెలుగులో రెండక్షరాలే!"

"అక్షరాలు ఎన్నయినా, అమెరికన్లకి, ఇండియన్ పేర్లు నోరు తిరగవు కదా" అన్నాడు బేతాళుడు.

"అందుకే - అసలు పేరుతో పాటు - ఒక చిన్న పేరు కూడా చెప్పటం మంచిది. సూర్యనారాయణమూర్తిని, సూరి అనో, సూర్య అనో, మూర్తి అనో చెబుతే, అమెరికన్లకి పిలవటానికి సులభంగా వుంటుంది. వాళ్ళ పేర్లను కూడా, మైకేల్‌ని మైక్ అనీ, డేనియల్‌ని డేన్ అని చిన్నవి చేసి పిలుస్తారు. అలాగే ఇది కూడానూ" అన్నాడు విక్రమరావ్. అతన్ని ఆఫీసులో అందరూ 'విక్' అని పిలుస్తారు.

"మీ స్నేహితుడి పేరేమిటి? గుడిపూడి వెంకట లక్ష్మీ నరసింహారావ్ - వెంకీ... ఆయనే కదా ఈ వూరు రాగానే, ఇండియాలో లాగా కారుని రోడ్డుకి ఎడమ ప్రక్కన నడిపి, ఆక్సిడెంటు చేశాడు...." అన్నాడు బేతాళుడు నవ్వుతూ.

"అవును! ఇక్కడికి రాగానే అలవాటు ప్రకారం, కారు ముందు సీట్లో, కుడి ప్రక్కన కూర్చుని, ఏమిటి ఈ కారులో స్టీరింగ్ వీల్ లేదన్నాట్ట - ఆఫ్‌కోర్స్ అది హాస్యానికి అన్నమాట అనుకో - కారులో స్టీరింగ్ వీల్ ఎడమ ప్రక్కన వుండటం, కారుని రోడ్డుకి కుడి ప్రక్కన నడపటం, అలవాటు అయేదాకా కొంచెం కష్టమే. ఇండియాలో తీసుకునే, ఇంటర్నేషనల్ డ్రైవింగ్ లైసెన్స్ కొన్ని రాష్ట్రాలలో అనుమతిస్తారు కానీ, చాలా రాష్ట్రాలలో ఒప్పుకోరు!"

"అవును మరి - ఇక్కడి ఫెడరల్ గవర్నమెంటు - అదే సెంట్రల్ గవర్నమెంటు - కి రాష్ట్రాల మీద అధికారం లేదు. ఏ రాష్ట్ర ప్రభుత్వ చట్టాలు, ఆ రాష్ట్ర ప్రభుత్వమే, వాళ్ళ ప్రజల మెజారిటీ అభిప్రాయాలతో తయారు చేసుకుంటుంది. పరిపాలిస్తుంది. అందులోని కొన్ని రాష్ట్రాల్లో, వచ్చిన వెంటనే, డ్రైవింగ్ లైసెన్స్‌కి ప్రిపేర్ అవటం, కంప్యూటర్ టెస్ట్, రోడ్డు టెస్ట్ పాసవటం అవసరం. ఇక్కడ లంచాల ప్రసక్తి లేదు కనుక, డ్రైవింగ్ వస్తే, పాసవటం కూడా చాలా సులభం. అమెరికాలో, చాలా ఊళ్ళలో కాళ్ళు లేకపోయినా ఫరవాలేదు కానీ, కార్లు లేకపోతే కష్టం. ముఖ్యంగా టెక్సాస్ లాంటి దక్షిణ రాష్ట్రాల్లో, ఇండియాలో లాగా

బస్సులమీద ఆధారపడితే, లాభం లేదు!" అన్నాడు బేతాళుడు.

కొంచెం ఆగి, మళ్ళీ అన్నాడు బేతాళుడు - "నువ్వు ఎప్పుడూ చెబుతుంటావు కదా - చాలా వూళ్లలో తెలుగు సాంస్కృతిక సంఘాలూ, మిగతా అన్ని ప్రాంతీయ సంఘాలూ వున్నాయి. క్రొత్తగా వూళ్ళో దిగగానే, వాళ్లను కలవటం మంచిది. ఎక్కడో, ఎప్పుడో పరిచయం వున్న వాళ్ళూ, బీరకాయ పీచు చుట్టరికం వున్నవాళ్ళూ, ఎదురుపడే అవకాశం చాలా వుంది. ఒకవేళ అలాటి వాళ్ళు ఎవరూ లేకపోయినా, ముక్కు ముఖం కూడా తెలియకపోయినా, కొత్తవాళ్ళకు సహాయం చేసేవాళ్ళు చాలా మంది వున్నారు. ముందు ఒకళ్ళు తెలిస్తే, తర్వాత తర్వాత అందరూ తెలుస్తారు. కాస్తో కూస్తో, పెద్ద వూళ్ళయితే, ఇండియన్ గ్రోసరీ షాపులు వుంటాయి. చిన్న వూళ్ళయితే, గ్రోసరీ దగ్గరలో వున్న పెద్ద వూళ్ళల్లో కానీ, మెయిల్ ఆర్డర్ ద్వారా కానీ కొనుక్కోవచ్చు - పెద్ద వూళ్లలో అయితే రెస్టారెంట్లూ, చీరల షాపులూ, వీడియో షాపులూ... దేనికీ కొదవ లేదు -" హిల్ క్రాఫ్ట్ రోగైల్, హేవే ఫిఫ్టీ నైన్ మీద నించీ 'ఆనంద భవన్' రెస్టారెంటు, రాయల్ శారీ పాలెస్, ఇండియన్ గ్రోసరీ షాపులు కనిపిస్తున్నాయి.

విక్రమరావ్ నవ్వుతూ అన్నాడు - "బేతాళుడూ - నువ్వు అమెరికా బేతాళుడవని, చెప్పకుండానే ఎలా తెలుస్తుందో తెలుసా? నీ మాటలు వింటుంటే! - అమెరికన్స్‌కి చాలా ఎక్కువగా మాట్లాడటం అలవాటు. రెండు మూడు వాక్యాల్లో చెప్పగలిగే విషయాన్ని, వాళ్ళు పావుగంట సేపు చెబుతారు. అందుకే జపనీస్, అమెరికన్స్‌ని, మాట్లాడటం తప్ప చేతలు లేనివాళ్ళని వెక్కిరిస్తుంటారు కూడాను - మన భారతీయులకు, చాలా మందికి, ముక్తసరిగా మాట్లాడటం అలవాటు. దాన్ని ఇక్కడ అమెరికన్స్ - 'లాక్ ఆఫ్ కమ్యూనికేషన్' అంటారు. ఉద్యోగాల్లో, చదువుల్లో, పైకి పోవటానికి అడ్డం వచ్చే మన అలవాట్లలో ఇదొకటి. తర్వాత వీళ్ళు మాట్లాడే చాలా మాటలు ఫార్మాలిటీ కోసం అనేవి. ఉదాహరణకు, ఏదన్నా చౌకబారు బహుమతి ఇచ్చినా కూడా - ఓ చాలా చాలా బాగుంది - అంటారు మన ఎదురుగా, 'ఇటీజ్ గ్రేట్' అనటం మామూలు, అదేదో 'గ్రేట్'గా లేకపోయినా ఒక విధంగా, అది మంచిదేమో - మనని నొప్పించరు కనుక - ఇంకో విధంగా ఒక ఇబ్బంది కూడా వుంది - వాళ్ళ మనసులో ఏముందో చెప్పటం కష్టం కనుక - అంత తొందరగా బయటపడరు!"

పెద్దగా నవ్వాడు బేతాళుడు - "నన్ను అన్నావ్, ఎక్కువగా మాట్లాడుతున్నానని - నువ్వు నాకన్నా ఎక్కువ మాట్లాడుతున్నావ్" అన్నాడు.

"అవును మరి - అమెరికాలో మార్కెటింగ్ ఉద్యోగం చేస్తూ, మాట్లాడకపోతే ఎలా?" అన్నాడు విక్రమరావ్.

"ఒకసారి నువ్వు అన్నావ్ - అమెరికన్స్ చాల ఇన్‌ఫార్మల్‌గా కనిపిస్తారు కానీ, చాలా చాలా ఫార్మల్ మనుష్యులని - దాని గురించి చెప్పు - వినాలని వుంది" అడిగాడు బేతాళుడు.

"నేను చెప్పటం కాదు - అది నిజంగా నిజం. పరిచయం అయిన పది నిముషాల్లో పేరుతో పిలిచి, చాలా చనువుగా మాట్లాడతారు. అదే ఇంగ్లాండులో అయితే, 'మిష్టర్ రవీ'

అని పిలుస్తారు. కానీ, వర్తి పేరుతో పిలవరు. బాగా స్నేహితులయిన తర్వాత కానీ, 'రవీ' అని పిలవటం మొదలు పెట్టరు. అప్పుడు చాలా చనువుగా, స్నేహంగా వుంటారు. కానీ అమెరికాలో, వెంటనే పేరుతో పిలిచినా, ఆ దూరాన్ని మాత్రంఅలాగే వుంచుతారు. మనం పార్టీకి పిలుస్తే వస్తారు. కానీ కాజువల్‌గా కాకుండా, చాలా ఫార్మల్‌గా. కరెక్ట్ టైముకి రావటం, చెప్పిన టైముకి వెళ్లిపోవటం, పిల్లలను ఇంట్లోనే, బేబీ సిట్టర్ దగ్గర వదిలి రావటం, పార్టీ అయిన రెండు రోజుల్లో - పిలిచినందుకు 'థాంక్స్' చెబుతూ కార్డు పంపించడం. వాళ్లు మనని మళ్ళీ పిలవటం అరుదు. ఒకవేళ పిలిచినా, మనం కూడా పిల్లల్ని ఇళ్ళల్లో వదిలి వెళ్ళటం లాటి ఫార్మాలిటీస్ పాటించాలి. ఏదన్నా పుస్తకమో, వస్తువో, వాళ్ళ ఇంటి దగ్గర తీసుకోవాలంటే, అంతా తలుపు బయటే జరుగుతుంది. మనలాగా లోపలకు ఎలిచి కాఫీలు యివ్వటం, కాసేపు బాతాఖానీ వేయటం లాటివి మామూలుగా జరగవు. ఒక ఉదాహరణ చెబుతాను - మా అబ్బాయి వెళ్ళే స్కూలుకే వెళుతుంది, మా యింటి ఎదురుగుండా వున్న అమెరికన్ అమ్మాయి. ఒక రోజు మా ఆవిడ, మా కుర్రాడ్ని స్కూలుకు తీసుకు వెళుతుండగా, వచ్చింది ఎదిరింటి ఆవిడ. వచ్చి - ఆవిడ కారు పాడయిందనీ, వాళ్ళమ్మాయిని కూడా, స్కూలుకి తీసుకు వెళ్ళమని, సునీతను రిక్వెస్టు చేసింది. సునీత వాళ్ళమ్మాయిని కూడా మావాడితో పాటు స్కూలుకు తీసుకు వెళ్లింది. ఆ రోజు సాయంత్రం, ఎదురింటి ఆయన వచ్చి నాతో - 'ప్రొద్దున మీ ఆవిడ మా అమ్మాయిని కారులో స్కూలుకు తీసుకు వెళ్లిందట, నేను ఎంత పే చేయాలి' అని అడిగాడు. మేము డబ్బు కోసం చేయలేదనీ, ఇద్దరు పిల్లలూ ఒకే స్కూలుకు వెడుతున్నారు కనుక, అదొక బాదరబందీ కాదని చెప్పి వాళ్లను ఒప్పించేసరికి ఇరవై నిమిషాలు పట్టింది. వెడుతూ వెడుతూ ఆయన - 'ఈసారి ఎప్పుడన్నా మీ అబ్బాయిని స్కూలుకి తీసుకు వెళతాం లెండి' - అన్నాడు కూడా".

"ఒక విధంగా అది మంచిదే కదా - " అన్నాడు బేతాళుడు.

"నేను ఏది మంచీ, ఏది చెడూ అని చెప్పటం లేదు. మన ఈ రెండు సంస్కృతుల లోను వున్న వ్యత్యాసాలని చూపిస్తున్నాను - అంతే! అలాగే ఇంటికి పార్టీకి వచ్చి, మన ఇంటి ముందర క్రింద పడి కాలికి దెబ్బ తగిలితే, మనని 'సూ' చేసి, డబ్బులు వసూలు చేస్తారు కూడా..." చెప్పటం ఆపాడు విక్రమరావు.

"నేను ఈమధ్య నీతో ప్రసాద్ గారింటికి పార్టీకి వచ్చినపపడు ఆయన చెప్పాడు గుర్తుందా. అక్కడికి, ఇక్కడికి కొన్ని తేడాలు. ఇండియాలో అన్నీ 220 ఓల్టుల మీద నడిస్తే, ఇక్కడ నూట పది ఓల్టుల మీద నడుస్తాయి. అక్కడ కేజీలు, కిలోమీటర్లు, సెంటిగ్రేడు అయితే, యిక్కడ పౌండ్లు, మైళ్లు, ఫారన్‌హీటు. అమెరికాలో స్విచ్ పైకి వేస్తే ఆన్ - క్రిందకు వేస్తే ఆఫ్. ఇక్కడ వీడియోల సిస్టమ్ వేరు. ఇండియా వీడియోలు, ఈ సిస్టమ్‌లోకి మార్చకపోతే పనికిరావు. సీలింగ్ ఫాన్లకి ఇండియాలో లాగా మూడు రేకులు కాకుండా, నాలుగు కానీ, అయిదు కానీ వుంటాయి. అలాగే ఇంగ్లీష్‌లో తేడాలు. ఇండియాలో "జడ్"ని అమెరికాలో 'జీ' అంటారు. ఎయిరోడ్రోమ్ - ఇక్కడ ఎయిర్‌పోర్ట్. లిఫ్టని ఎలివేటర్ అంటారు. సైకిల్ -

బైక్, మమ్మీ మామి అవుతుంది. ఇండియాలో టాయ్‌లెట్, యిక్కడ రెస్ట్ రూమ్. ఇండియాలో పేవ్‌మెంటు ఇక్కడ సైడ్ వాక్. ఇండియాలో హోటలు - ఇక్కడ రెస్టారెంటు. అమెరికాలో వసతి చేసే చోటుని హోటల్ అంటారు. ఫోన్‌లో మాట్లాడాలంటే, 'రింగ్' చేయరు, 'కాల్' చేస్తారు. ఇలా ఆ రోజు ప్రసాద్ చాలా తేడాలు చెప్పాడు -"

విక్రమరావ్ నవ్వాడు - "నీకు బాగా గుర్తుందే - ప్రసాద్, ఇలాటివి బాగా చెబు తుంటాడు - ఇంకొక విషయం, ఒకళ్ళు మాట్లాడుతుంటే, వాళ్ళను ఆపి మాట్లాడటం మనకి అలవాటు ఇండియాలో. అది వీళ్ళకు నచ్చదు. వీళ్ళు చెప్పేది పూర్తిగా విని, అప్పుడు మనం మాట్లాడాలి. నాన్చుడు వ్యవహారంలా కాకుండా - ఏదయినా, కాన్ఫిడెంట్‌గా మాట్లాడటం అవసరం. అంతే కాదు, మాట్లాడేటప్పుడు వాళ్ళ కళ్ళల్లోకి చూస్తూ మాట్లాడటం మర్యాద. 'కళ్ళు కళ్ళు కలపటం' మన దేశంలో ప్రేమికులకు పరిమితం. ఇక్కడ కళ్ళు కలిపి మాట్లాడక పోతే, మనమేదో దాచేస్తున్నామని అర్థం. ఆడవాళ్ళయినా, మగవాళ్ళయినా, అలా కళ్ళల్లోకి చూస్తూ మాట్లాడకపోతే, అపార్థాలు చేసుకునే అవకాశాలు వున్నాయి. అంతేకాకుండా, సాధ్యమైనంత వరకూ రేస్, దేశం, ఆడా-మగా, మతం పరంగా మాట్లాడకుండా వుంటే, వాతావరణం స్వేచ్ఛా పూరితంగా వుంటుంది. మనకీ - అమెరికన్స్‌కీ వున్న మరొక్క తేడా వ్యక్తిత్వంలో వుంది. అమెరికన్స్‌లో 'నేను' అనే భావం ఎక్కువ. 'నేను' ఏదయినా చేయగలను. 'నా' కష్టాలూ, సుఖాలూ భవిష్యత్తుకు 'నేనే' బాధ్యుడ్ని. నా జీవితం - నా యిష్టం - అనే తరహాలో. కానీ భారతీయులు సంఘజీవులు. ఇవ్వటం - తీసుకొనటం సాంస్కృతిక ధర్మం. 'మనం' అనే భావం ఎక్కువ. అలా అనుకోవటం వల్లనే ఎన్నో లాభాలు - సంఘ ఐక్యత లాటివి - వుండే అవకాశాలు వున్నా, ఆ 'మనం'లో మిగతావాళ్ళు ఏ పనయినా చేస్తారులే, నేను చేయక పోయినా ఫరవాలేదు, అనే బాధ్యతారహితమైన ప్రవర్తనకు దోహద మవుతుంది".

కారు హైవే సిక్స్ మీదకు త్రిప్పాడు విక్రమరావ్. ఆ రోజు ట్రాఫిక్ తక్కువగా వుంది. అందుకే యాభై మైళ్ల స్పీడులో వెళ్లగలుగుతున్నాడు. అక్కడ చాలా ఫాస్ట్ పుడ్ రెస్టారెంట్లు వున్నాయి - మెక్‌డొనాల్డ్స్, టాకోబెల్, బర్గర్‌కింగ్, పిజ్జాహట్, కెంటక్కీ ఫ్రైడ్ చికెన్ లాటివి. విక్రమరావ్ చదువుకునేటప్పుడు, జాక్ ఇన్ ది బాక్స్ అనే రెస్టారెంట్లో పనిచేశాడు. చదువు కునేటప్పుడు తమకు కావలసిన డబ్బులు సంపాదించుకోవటం, అమెరికాలో అవసరం. అలవాటు. అలాటిచోట పనిచేయటం చిన్నతనమేమీ కాదు. చాలా మంది, ఎప్పుడో అప్పుడు అలాంటి ఉద్యోగాలు చేసినవారే. దానివల్ల వాళ్ళ గౌరవమేమీ తగ్గదు. పిల్లలు పదహారేళ్లు నిండగానే, సాయంత్రం పూట, శని, ఆదివారాలు ఇలాటి ఉద్యోగాల్లో చేరి, వాళ్ళ చదువులకూ, కారుకూ, మిగతా ఖర్చులకూ కావలసిన డబ్బులు సంపాదించుకుంటారు. అంతేకాదు, పదహారేళ్ళు దాటగానే - పిల్లలు వేరే అపార్ట్‌మెంటు తీసుకుని, తల్లిదండ్రులను వదిలి, అక్కడకు వెళ్లిపోతారు. ఒక ఊరులో ఉన్నా, అది మామూలే! వాళ్లకు ఆర్థిక స్వాతంత్ర్యం ఆ తెగువనిస్తుంది. అంతే కానీ, తల్లిదండ్రులకూ, వీళ్లకూ పడదని కాదు. అమెరికాలో పెరిగిన,

ఇండియన్ పిల్లలు కూడా ఈ పద్ధతికి అలవాటు పడ్డవారే!'

విక్రమరావ్ అన్నాడు – "ఈ దేశం వచ్చే మనవాళ్ళు, ముఖ్యంగా తెలుసుకోవలసినది, ఈ దేశంలో చాలా కష్టపడాలి. ఇండియన్స్ చాలామంది, అమెరికాలో జీవితం చాలా సుఖంగా, ఏ ఒడుదుడుకులు లేకుండా, సంపన్నవంతంగా వుంటుందని అనుకుంటారు. అది నిజం కాదు. చదువులో కానీ, ఉద్యోగంలో కానీ, బయటి జీవితంలో కానీ, ఎన్నో ప్రయాసలు, కష్టాలు ఎదురవుతాయి. ఆర్థికంగా, సాంస్కృతికంగా భాషా భేదంగా, డిస్క్రిమినేషన్ పరంగా... ఇండియా నించి అమెరికా వచ్చేటప్పుడు, ఇక్కడ బ్రతకటానికి దృఢ నిశ్చయంతో వస్తారు కనుక, చాలా మంది ఆత్మవిశ్వాసంతో, ధైర్యంగా ఈ కష్టనష్టాలన్నీ భరిస్తారు. కొన్ని సంవత్సరాలు వుండి, ఆర్థికంగా స్థిరపడిన తర్వాత, మంచి తెగింపు కూడా వస్తుంది. కానీ మొదటి రెండు మూడు సంవత్సరాలూ, ఈ ఒడుదుడుకులకు తట్టుకోవలసిన అవసరం వుంది. ఆఫీసుల్లో అతి వేగంగా పనిచేయటం, అనుకున్న సమయానికి రిజల్ట్స్ చూపించటం లాటివి మానసికంగా చాలా మథన కలిగిస్తాయి. ముఖ్యంగా ఇండియాలో ప్రభుత్వరంగంలో పనిచేసి వచ్చినవారికి, ఈ తేడా చాలా ఎక్కువగా కనిపిస్తుంది. అంతేకాకుండా, ఎంత అనుభవం వున్నా, ఎన్ని పేటెంటులు వున్నా, మధ్యమధ్యలో ఉద్యోగాలు పోవటం కూడా మామూలే. మన అసమర్థత వల్ల కాదు ఈ ఉద్యోగాలు పోయేది – కంపెనీ లాభాలు అనుకున్నంతగా లేకపోవటం వల్ల. విదేశీయుల మీద దురభిమానం వల్ల మళ్ళీ ఉద్యోగం దొరికే దాకా మానసిక వేదన కృంగదీస్తుంది. అలాగే ఇంటి దగ్గర మన పనులు మనమే చేసుకోవాలి. పని మనుషులను పెట్టుకుంటే, గంటకి ఇంత అని పేచేస్తే, తడిపి మోపెడవుతుంది మరి. ఇల్లు వాక్యూమ్ చేయటం, లాన్ మో చేయటం, రోజూ అంట్లు తోముకోవటం, బట్టలుతుక్కోవటం, అన్ని పనులూ చేసుకోవాలి. అవన్నీ ఇక్కడ ఆడవాళ్ళ పనులు కావు. భార్యాభర్త లిద్దరూ, ఉద్యోగాలతో, చదువులతో బిజీగా వుంటారు కాబట్టి – అవన్నీ ఇద్దరి పనులూనూ".

కారుని హైవే సిక్స్ మీద నించి ఆడిక్స్ క్లోడిన్ రోడ్ మీదకు త్రిప్పాడు విక్రమరావ్.

బేతాళుడు అంతసేపూ నిశ్శబ్దంగా వుండటం గమనించి అన్నాడు విక్రమరావ్ – "ఏం దిగులుగా వుందా – మనిద్దరి మధ్యా వియోగం వస్తున్నదని"–

ఒక క్షణం మౌనం వహించి అన్నాడు బేతాళుడు – "అవును – పూర్వం ఇండియాలో ఎన్ని సంవత్సరాలు కలిసి వున్నామో కానీ, ఇక్కడ మాత్రం ఒక సంవత్సరం నించీ మనిద్దరం చాలా సన్నిహితంగా మెలిగాం. పన్నెండు కథలు చెప్పుకున్నాం. చచ్చిపోయిన కమ్యూనిజం దగ్గరనించీ, పోలీసు ప్రహసనాలూ, గోంగూర కథలూ, పాస్‌పోర్టు ఆఫీస్ కథలూ, పచ్చకార్డు కథలూ, అమెరికాలోని భారతీయుల పిల్లల కథలూ, భవిష్యత్ కథలూ, జీవితంలో జరిగే చాలా విషయాలు ముచ్చటించుకున్నాం. కలసి ఆనందించేం. బాధపడ్డాం. ఇప్పుడు మనం విడిపోయే సమయం ఆసన్నం అయింది!"

విక్రమరావ్ బేతాళుడ్ని వింతగా చూసేడు - "నువ్వు ఈ మానవ సహజమయిన అనుభూతులకు అతీతుడవనుకున్నాను బేతాళుడూ. మొత్తానికి నా అంచనాని తప్పు చేశావు. అయినా - నేను జపాను వెళ్లేది ఒక్క సంవత్సరమే. మళ్లీ వస్తాను. అప్పుడు ఇంకా చెప్పుకో వలసిన కథలు వుంటే చెప్పుకుందాం లేదా ఒకళ్లకొకళ్లు తోడుగా, స్నేహంగా వీలున్నప్పుడల్లా కలుస్తూ కాలక్షేపం చేద్దాం!" అన్నాడు.



ఆ రోడ్డు మీద ఎదురుగా ఒక కారు వస్తున్నది. అతను రోడ్డుకి కుడి ప్రక్కన కాకుండా, ఎడమ ప్రక్కన నడుపుతున్నాడు. విక్రమరావ్ కొంచెం ఆలస్యం చేస్తే, ఆ కారు గ్రుద్దుకునేదే. చట్టుక్కున ఎడమ ప్రక్కకు త్రిప్పి, ప్రమాదాన్ని తప్పించాడు.

బేతాళుడు గాభరాగా అన్నాడు - "ఆ కారు నడుపుతున్నది ఎవరయ్యా! తాగినట్టున్నాడు - రోడ్డుకి ఎడమ ప్రక్కన నడుపుతున్నాడు".

విక్రమరావ్ నవ్వాడు - "అతను త్రాగలేదు ప్రక్క రోడ్డులో వుంటున్న శ్రీ రామశర్మ గారి బావమరిది. ఈమధ్యనే ఇండియా నించి వచ్చాడు. రోడ్డుకు, కుడి ప్రక్కన నడపటం యింకా అలవాటయినట్టు లేదు!" అంటూనే తన డ్రైవ్ వే లోకి త్రిప్పాడు కారుని.

"కుడి ఎడమయిందన్నమాట!" అన్నాడు బేతాళుడు.

"కుడి ఎడమయితే పొరపాటు లేదన్నాడు దేవదాసు. ఆ మాటన్నప్పుడు అతను త్రాగి వున్నాడనుకో! అదిక్కడ పనిచేయదు. జాగ్రత్తగా వుండకపోతే, ఇద్దరం చచ్చి వుండేవాళ్లం!" అన్నాడు విక్రమరావ్ కారుని ఆపుతూ.

అమెరికా బేతాళుడు, విక్రమరావ్ చేతిని ఆప్యాయంగా నొక్కాడు. చిరునవ్వు నవ్వాడు కానీ అతని కళ్లల్లో నీళ్లు మెరుస్తున్నాయి. ఒకసారి చెయ్యి వూపి, పైకి ఎగిరి మాయమయి పోయాడు.

విక్రమరావ్ దీర్ఘంగా నిట్టూర్చి, ఇంట్లోకి వెళ్లిపోయాడు.

❖